క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీ.. దసరా శుభాకాంక్షలు

భానుపురి, సూర్యాపేట టౌన్: జిల్లా ప్రజలు కోరుకున్న రంగాల్లో విజయం సాధించాలని, దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆకాంక్షించారు. శుక్రవారం వారు వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

మద్యపాన నిషేధం అమలుచేయాలని వినతి



ఎస్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని గట్టికల్లులో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని, బెల్టు షాపులు నిర్వహించకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆ గ్రామస్తులు ఎస్‌ఐ సైదులుకు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. గ్రామంలో మద్యపాన నిషేధం అమలు చేసేందుకు గ్రామస్తులం ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు. అక్రమంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపే తుంగతుర్తి వెనుకబాటుకు కారణం'

తుంగతుర్తి : కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు గెలిచినా తుంగతుర్తి మండల కేంద్రం వెనుకబాటుకు గురవుతుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో గెలిచిన కాంగ్రెస్ పాలకులు తుంగతుర్తిలో ఏర్పాటు చేయాల్సిన మార్కెట్‌ను వేరే ప్రాంతానికి తరలించారని అన్నారు. మళ్లీ ఇప్పుడు తుంగతుర్తిలో నిర్మించాల్సిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తిరుమలగిరికి తరలించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, దొంగరి శ్రీనివాస్, గోపగాని శ్రీనివాస్, దాసు, వెంకన్న పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న మృతుడి స్నేహితులు

పెన్‌పహాడ్ : మృతుడి కుటుంబానికి అతడి స్నేహితులు ఆర్థిక చేయూత అందించారు. మండల పరిధిలోని మాచారం గ్రామానికి చెందిన గద్దల సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో 2005 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు శుక్రవారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించేందుకు ముందుకువచ్చారు. మృతుడి కుమార్తె ఆర్వీ పేరు మీద రూ.లక్ష 18వేలను ఏపీజీవీబీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మృతుడి భార్య దీపికకు డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటాలు బహూకరణ



వెండి కిరీటాలతో దాతలు

నూతనకల్ : మండల కేంద్రంలోని శ్రీపార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి ఆలయంలో దేవతామూర్తులకు దాతలు శుక్రవారం వెండి కిరీటాలను బహూకరించారు. గ్రామానికి చెందిన కాప రవికుమార్-రమణ, భయ్యా రవికుమార్-శ్రీదేవి దంపతులు రూ. 50వేలు విలువ చేసే వెండి కిరీటాలను మహిషాసురమర్ధిని అవతారంలో ఉన్న అమ్మవారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చురుకంటి చంద్రారెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి అంజయ్య, బత్తిని లక్ష్మయ్య, విఠల్‌రెడ్డి, యాస ముత్తారెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి, యాస శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు శ్రీరామ్‌శర్మ, లక్ష్మీనర్సింహ శాస్త్రి పాల్గొన్నారు.

బస్సులు రాక.. ప్రయాణం సాగక!

- ఆర్టీసీ సేవలకు నోచుకోని ఆత్మకూరు మండలం
- ప్రయాణం చేయాలంటే ప్రైవేట్ వాహనాలే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఆత్మకూర్ (ఎస్) : సూర్యాపేట జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొత్త జిల్లాలు ఏర్పడగా సూర్యాపేట జిల్లా కేంద్రంగా మారింది. దీంతో సూర్యాపేట చుట్టుపక్కల గ్రామాలలో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ప్రజలు ఆశించారు. కానీ బస్సు సౌకర్యానికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పించాలని అప్పటి ప్రభుత్వం సంకల్పించి రోడ్ల నిర్మాణం చేపట్టింది. దీంతో ఆత్మకూరు మండలానికి కూడా డబుల్ రోడ్డు సౌకర్యం ఏర్పడింది. కానీ బస్సు సౌకర్యం మాత్రం కల్పించలేదు. దీంతో జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లాలనుకున్న ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలకు గురవుతున్నారు. కాగా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కలుగుతుందని ఆశించినప్పటికీ మండలవాసుల కల నెరవేరడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ మండల మహిళలు ఆ పథకాన్ని వినియోగించుకోలేకపోతున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగానే..

బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రంలోని వివిధ కార్యాలయాలకు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కార్యాలయాలకు చేరుకోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల అభ్యర్థనతో మండల కేంద్రం మీదుగా మహబూబాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించినా అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఇటీవల వచ్చిన వర్షాలతో బస్సు సౌకర్యం నిలిపివేశారు. దీంతో మండల ప్రజలు, విద్యార్థులు మళ్లీ ప్రైవేట్ వాహనాల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రం మీదుగా మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల వాసులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



సూర్యాపేట జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించలేదు. దీంతో ఆత్మకూరు మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడానికి విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలకు గురవుతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలి.

– గోపగాని రవి, విద్యార్థి సంఘం నేత

అధికారులు పట్టించుకోవడం లేదు



మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో అధికారులు, మండలానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సు సౌకర్యం కల్పించలేమని అన్నారు. కానీ ప్రస్తుతం మండల కేంద్రానికి డబుల్ రోడ్డు ఉంది. అయినా బస్సు సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వగా కొన్నిరోజులు బస్సును నడిపించి మళ్లీ బంద్ చేశారు. మండల ప్రజలకు బస్సు సర్వీస్‌లు కొనసాగించాలి.

– పందిరి మాధవరెడ్డి, యువజన సంఘం నాయకుడు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాగారం : పసునూరులో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నాగారం : మండలంలోని పసునూరు జెడ్పీహెచ్‌ఎస్ 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దొంతమల్ల రాజేష్, లక్ష్మణ్, ఎన్. విజయ్, ఎన్. సోమయ్య, ఎం. అనిల్, యూ. గణేష్, చైతన్య, పరశురాములు, ఎం. అనూష, లలిత, సంధ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని చైతన్య భారతి ఉన్నత పాఠశాలకు చెందిన 2003–2004 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శుక్రవారం అర్వపల్లిలో నిర్వహించారు. 20ఏళ్ల తర్వాత కలుసుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను సన్మానించారు. రోజంతా ఆటపాటలతో సరదగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేశగాని మహేశ్వర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రామ్మూర్తి, సోమయ్య, డి. శ్రీనివాస్, పి. శ్రీనివాస్, దయాకర్, అయోధ్య, శ్రీనివాస్, దేవయ్య, శ్రీని వాస్, రవీందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అర్వపల్లి : గురువులతో పూర్వ విద్యార్థులు

పీఆర్‌టీయూ కమిటీకి ఎన్నిక

పెన్‌పహాడ్ : మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన స్టేట్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నెమ్మాది వెంకటేశ్వర్లు, యరగాని లింగయ్య, మామిడి వెంకటయ్య, ఎండీ జమాల్‌షరీఫ్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లుగా కొచ్చర్ల ప్రభాకర్, యర్రంశెట్టి రవీందర్, రాచూరి కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శిగా బొంగిడి కృష్ణయ్య ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల మండల పీఆర్‌టీయూ నాయకులు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని ముకుందాపురంలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. ముకుందాపురం గ్రామానికి చెందిన పుప్పాల నర్సయ్య తన వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం గేదెను మేతకు వదిలాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ లైన్ వైర్ తెగి గేదెపై పడింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



జమ్మిగడ్డలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



జమ్మిపూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రవి, పట్టణ సీఐ రాజశేఖర్, తదితరులు

సూర్యాపేటటౌన్ : విజయదశమి వేడుకలకు జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజల సౌకర్యార్థం లైటింగ్, తాగునీరు, బారికేడ్లు, స్టేజీ ఏర్పాటు తదితర వసతులు కల్పించారు. జమ్మిపూజ జరిపే ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ రవి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ సీఐ రాజశేఖర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఏర్పాట్లను పరిశీలించారు. జమ్మి పూజకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించామని చెప్పారు. సంతోషిమాత దేవస్థానం వారి ఆధ్వర్యంలో దేవతామూర్తుల విగ్రహాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

అర్వపల్లి : విజయదశమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామాల్లో జమ్మిపూజ కోసం ఆలయాలు, బొడ్రాయిల వద్ద గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ కోరారు. సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వేడుకలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం

- మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట : మున్సిపల్ కమిషనర్ వైఫల్యంతో బతుకమ్మ వేడుకలకు సౌకర్యాలు కల్పించలేదని, కమిషనర్ వైఖరి మార్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా మున్సిపల్ కమిషనర్ పనిచేయాల్సి ఉన్నప్పటికీ అలా చేయడం లేదని అన్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పే పనులు, కమీషన్లు వచ్చే పనులు మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కమిషనర్ తన పద్ధతి మార్చుకొని, ప్రజల చేత ఎన్నుకోబడ్డ పాలకవర్గాన్ని గౌరవించి నడుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, కౌన్సిలర్ ఎస్‌కే తాహెర్ పాషా, ఆకుల కవిత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు పెద్దపంగు స్వరూప, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బత్తుల రమేష్, బత్తుల జానియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్‌పై విమర్శలు

- సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజుద్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న అంజుద్ అలీ

భానుపురి : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఆయన అనుచరులు విమర్శలు చేస్తున్నారని సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజుద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు డీజేలను అధికారులు నియంత్రించారని అన్నారు. మున్సిపల్, పోలీస్ సిబ్బంది వినాయక చవితి నుంచి విజయదశమి వరకు నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారని చెప్పారు. మహిళలు బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొంటే చూసి ఓర్వలేని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఆయన అనుచరులు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బతుకమ్మ పండుగను రాజకీయం చేయడం జగదీష్ రెడ్డి తెలివి తక్కువతనానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నాయకులు గండూరి రమేష్, రాజేందర్, శబరినాథ్, మణి, నాగరాజు, భార్గవ్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దిని అవతారంలో దుర్గామాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం దుర్గామాత మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చింది. భక్తులు దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



సూర్యాపేట టౌన్ : శ్రీకనకదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దంపతులు



పెన్‌పహాడ్ : లింగాలలోని కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



అర్వపల్లి : తిమ్మాపురంలో హోమం..



మద్దిరాల : కుక్కడంలో పూజలు చేస్తున్న భక్తులు



నాగారం : మాచిరెడ్డిపల్లిలో..



తిరుమలగిరిలో..



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో అన్నదానం..



పెన్‌పహాడ్‌లో..

తుంగతుర్తిలో పలువురి ముందస్తు అరెస్టు



తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్న తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శుక్రవారం తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమం ఉండడంతో ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని అన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటును బేషరతుగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో తడకమళ్ల రవికుమార్, గునగంటి సంతోష్, బొంకురి మల్లేష్, కొండగడుపుల వెంకటేష్, ఉప్పుల నాగమల్లు, బొజ్జ సాయికిరణ్, తడకమళ్ల మల్లికార్జున్, తడకమళ్ల అనిల్, పడపాటి మధు, చింతకుంట్ల సురేష్, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న రూరల్ సీఐ సురేందర్ రెడ్డి

చివ్వెంల : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట రూరల్ సీఐ వై.సురేందర్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన వంటి అంశాలపై శుక్రవారం రాత్రి మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని బి.చందుపట్లలో కళాజాతా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గంజాయి, మత్తుమందు, గుట్కా నిషేధం పట్ల పటిష్టంగా పనిచేస్తున్నామన్నారు. విద్యార్థులు, యువతీ యువకులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికావొద్దని, బ్యాంకు ఖాతా, ఓటీపీ, ఏటీఎం వంటి వివరాలను ఇతరులకు తెలుపవద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అదే విధంగా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం సభ్యులు ఆట, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బి.వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ ఉద్యమాలకు దిక్సూచి.. పీడీఎస్‌యూ

నూతనకల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు నిర్వహించే ఉద్యమాలకు దిక్సూచి పీడీఎస్‌యూ అని ఆ సంఘం పూర్వ విద్యార్థి నాయకులు సాబాది వెంకట్‌రెడ్డి, ముప్పాని సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 24న నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పూర్వ నాయకులు గంటా నాగయ్య, కునుకుంట్ల సైదులు, పెద్దింటి రంగారెడ్డి, దేసోజు మధు, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పంతం యాకయ్య, మున్నా అశోక్, మందడి భూపాల్ రెడ్డి, కూసు లింగయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఆగిపోయిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల ఇబ్బందులు



ఐలాపురం గ్రామ స్టేజీ వద్ద మరో బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

చివ్వెంల : బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సంఘటన ఐలాపురం గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సూర్యాపేట నుంచి బంగ్లాకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గ మధ్యలో చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ స్టేజీ వద్ద ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు మరో వాహనం కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ఆర్టీసీ అధికారులు మరో బస్సు తెప్పించడంలో ఆలస్యం కావడంతో కొంతమంది ఆటోలు, బైక్‌లు ఆపి ఎక్కి వెళ్లిపోయారు. గంట తర్వాత అదే బస్సును రిపేరు చేసి మిగిలిన ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

నాగారం : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కడియం పరమేశ్వర్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో వాలీబాల్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. అనంతరం క్రీడల నిర్వహణకు రూ.5000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, జాజుల వీరయ్య, అనంతుల వెంకటయ్య, దున్న పోతుల చంద్రశేఖర్, ఆవుల నరేష్, కొమ్ము నరేష్, కత్తుల వెంకన్న, వంగూరి అంజి, బైరబోయిన మహేష్, బొబ్బిలి మహేష్, గంట వీరస్వామి, కన్నెబోయిన లింగమల్లు, కన్నెబోయిన నాగరాజు, చీమల వెంకన్న, కడియం శ్యామ్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా రమేష్

అర్వపల్లి : సూర్యానాయక్‌తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కైరంకొండ రమేష్ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రమేష్‌ను పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైదులు, పురుషోత్తం సన్మానించారు.

- అట్లాంటాలో సద్దుల బతుకమ్మ సందడి



అమెరికాలోని అట్లాంటాలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా మహిళలు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటును హర్షిస్తూ అర్వపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తొండ గ్రామంలో జరిగే స్కూల్ శంకుస్థాపనకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్ రెడ్డి, జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, దాసరి సోమయ్య, బైరబోయిన మహరాజు, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, దిర్శనపు కృష్ణమూర్తి, బద్దం యాదగిరి, కె.ఉదయ్, కుంకుడుపాల రవి, సైదుల కిరణ్, సైదులు, కొమారి మల్లయ్య, నిమ్మల నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.